క్లుప్తంగా

రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారిగా శ్రీశైలం



మునగాల : మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా యల్లా శ్రీశైలం గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వర్తించిన ఎల్.దిలీప్‌కుమార్ ఉన్నత విద్యనభ్యసించేందుకు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో యాదాద్రి జిల్లా మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పనిచేస్తున్న శ్రీశైలం బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది నూతన వైద్యాధికారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు వినోద, శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ లింగం రామకృష్ణ, సిబ్బంది స్వాతి, శాంతయ్య, నరసమ్మ, జగ్గయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

నేడు కోదాడ మున్సిపల్ ప్రత్యేక సమావేశం

కోదాడ : ఐదు నెలలుగా వేతనాలు లేకుండా పని చేస్తున్న 70 మంది పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల విషయాన్ని చర్చించడానికి శుక్రవారం కోదాడ మున్సిపాలిటీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించడంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు 70 మంది కార్మికులను దినసరి వేతనంపై తీసుకోవడం, 35 వార్డులలో సరిపడ పారిశుద్ధ్య సిబ్బందిని దినసరి వేతనంపై తీసుకోవడానికి విధివిధానాలను చర్చించడానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా అభిమన్యు

నడిగూడెం : ఎమ్మార్పీఎస్ నడిగూడెం మండల ఇన్‌చార్జ్‌గా దున్నా అభిమన్యు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం నడిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్, జిల్లా ఇన్‌చార్జ్ బొజ్జా సైదులు తనను నియమించినట్లు తెలిపారు. మండలంలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

'మన ఊరు- మన బడి' పనులకు శంకుస్థాపన

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ త్రిపురం సీతారాంరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో వంట గది, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుధీర్, వార్డు సభ్యులు మన్నెం రాంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బొంత వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి

నడిగూడెం : నడిగూడెం మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ యాతాకుల జ్యోతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఐదవ వార్డులో మండల పరిషత్ నిధుల కింద మంజూరైన నాలుగు లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, ఎండీ.అప్జల్, కాల నీవాసులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : డిసెంబర్‌లో నిర్వహించిన ఐఎస్‌టీఎస్ఈ ఒలింపియాడ్ పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల హెచ్‌ఎం పీవీ రమణారావు తెలిపారు. ప్రథమ స్థాయిలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థాయికి చేరిన 77 మంది విద్యార్థులను గురువారం పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీ పరీక్షలలో మ్యాథ్స్, సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టులలో విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పల్లకి బహూకరణ

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల జై శ్రీమన్నారాయణ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో గురువారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆ గ్రామానికి చెందిన తుంగతుర్తి నారాయణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు జై శ్రీమన్నారాయణ రూ. 25 వేల విలువగల టేకు పల్లకిని (గోదాదేవి అమ్మవారి పల్లకి) ఆలయానికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జోగు సరోజనమ్మ, మాజీ చైర్మన్ ఎల్లావుల పిచ్చయ్య, భక్తులు ఉన్నారు.

టేలాండ్‌లో జోరుగా వరినాట్లు

- బోర్లు, బావుల కింద దాదాపు 10 వేల ఎకరాల్లో సాగు
- వేసవిలో వ్యవసాయానికి సరిపడా కరెంట్ ఇవ్వాలని రైతుల వేడుకోలు



బోడబండతండా వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

మఠంపల్లి : మండలంలోని టేలాండ్‌లో (చివరి ఆయకట్టు) యాసంగి వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ప్రతిఏటా సంక్రాంతి తరువాత వరినాట్లు మొదలుపెట్టే ఆ ప్రాంత రైతులు ఈ ఏడాది ముందుగానే వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఇప్పుడే విద్యుత్ కోత విధిస్తుండటంతో మున్ముందు వ్యవసాయానికి విద్యుత్ సరిపడా ఇస్తారో లేదోనన్న భయంతో రైతులు నాట్లు ప్రారంభించారు. ఇప్పటికే బోర్లు, బావులు కింద వ్యవసాయ విద్యుత్ మోటార్ల సహాయంతో రైతులు సాగు మొదలు పెట్టారు.

10 వేల ఎకరాల్లో..

మండలంలోని టేలాండ్ ప్రాంతాలైన భీల్యానాయక్‌తండా, బోడబండతండా, లాలితండా, దొనబండత ండా, కొత్తతండా, జామ్లాతండా, తుమ్మలతండా, మ అచ్యాతండా తదితర గ్రామాల పరిధిలో బోర్లు, బా వుల కింద సుమారు 10 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఒకపక్క ఎరువుల ధరలు విపరీతంగా పెరగ డం, మరోకపక్క విద్యుత్ కోతతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టేలాండ్‌లో మార్చి, ఏప్రిల్ మాసాలలో భూ గర్భ జలమట్టాలు తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సాగుచేసిన వరిపంటలు చేతికొచ్చే వరకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని టేలాండ్ రైతులు కోరుతున్నారు.

24 గంటల విద్యుత్ ఇవ్వాలి



వ్యవసాయానికి ప్రస్తుతం 12 గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదు. దీంతో యాసంగిలో పొలాలు ఎండిపోయే అవకాశం ఉంది. ట్రాన్స్‌కో అధికారులు చివరి ఆయకట్టుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి.

– బానోతు బాబునాయక్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బోడబండతండా

వానాకాలంలో నష్టపోయాం



మండలంలోని చివరి ఆయకట్టులో వానాకాలంలో వరినాట్లు ఆలస్యంగా వేసి నష్టపోయాం. అందుకే యాసంగి కొంత ముందస్తుగా వరినాట్లు పెడుతున్నాం. మార్చి, ఏప్రిల్‌లో భూగర్భ జలాలు తగ్గుతాయి. కావునా అధికారులు టేలాండ్‌కు సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి ఆదుకోవాలి.

బోగాల పిచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్, అల్లీపురం

కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలి



నేరేడుచర్ల : ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఈనెల 6వ తేదీన కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చల్లా శ్రీలతారెడ్డి కోరారు. ఈమేరకు గురువారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, కౌన్సిలర్లు తాల్లూరి సాయి, అలక సరితాసైదిరెడ్డి, అమరారపు లలితాభరత్, వేమూరి నాగవేణి నారాయణ, నాయకులు నాగండ్ల శ్రీధర్, వల్లంశట్ల రమేష్‌బాబు, చిత్తలూరి సైదులు, మార్కెండేయ, రాములు తదితరులున్నారు.

కేటీఆర్ పర్యటనకు తరలిరావాలి

పాలకవీడు : హుజూర్‌నగర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు శుక్రవారం రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కేటీఆర్ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనారాయణరెడ్డి, నాయకులు పసుపులేటి సైదులు, శంకర్‌నాయక్, నరినాయక్, నాగుల్‌మీరీ, మహబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ పాలనను అంతం చేయడమే లక్ష్యం

నేరేడుచర్ల : రానున్న ఎన్నికల్లో కేసీఆర్ దోపిడీ పాలనను అంతం చేయడమే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లక్ష్యమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. గురువారం నేరేడుచర్లలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ ఎర్రమళ్ల నాగమణి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొళ్లగాని సుబ్బు గౌడ్, నర్సింహరావు, ఉపేందర్, చంటి, హుస్సేన్, వీరాంజనేయులు, వెంకటేష్, సురేష్‌బాబు, వర్మ తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన జడ్జి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జడ్జి శ్యాంసుందర్

కోదాడఅర్బన్ : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కోదాడ కోర్టు హాల్లో కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యాంసుందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులు కాలానుగుణంగా కేసులు సత్వర పరిష్కారానికి ప్రణాళిక రూపొందించుకుని ముందుకు పోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎస్ఆర్‌కే మూర్తి, వేజళ్ల రంగారావు, రాంరెడ్డి రంజాన్‌పాషా, హనుమంతరావు, శరత్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొండపల్లి వాసుదేవరావుకు పలువురి నివాళి



కోదాడఅర్బన్ : వాసుదేవరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



కోదాడ : నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి, నాయకులు

కోదాడఅర్బన్ : మాజీ డీఎల్‌పీఓ కొండపల్లి వాసుదేవరావు మృతి సమాజానికి తీరని లోటని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం కోదాడలో నిర్వహించిన వాసుదేవరావు దశదిన కర్మలో పాల్గొని వాసుదేవరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, వివిధ పార్టీల నాయకులు వెంకటరత్నంబాబు, పారా సీతయ్య, కనగాల వెంకట్రామయ్య, నూనె సులోచన, శ్రీనివాస్, సయ్యద్ మునావర్, జట్టుకొండ బసయ్య, కుటుంబసభ్యులు రామచందర్‌రావు, లక్ష్మీనారాయణ, సుగుణాకర్ నివాళులర్పించారు.

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పద్మావతి..

కోదాడ : కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కలిగిన నాయకుడిగా పని చేసిన కొండపల్లి వాసుదేవరావు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం కోదాడలో జరిగిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ డీఎల్‌పీఓ వాసుదేవరావు సంతాప సభలో ఆమె పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, పారా సీతయ్య, కందుల కోటేశ్వరరావు, షమ్మి, కర్రి సుబ్బారావు, బాగ్దాద్, మాతంగి బసవయ్య, పాలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐని బలోపేతం చేయాలి

చిలుకూరు : గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం చిలుకూరు సీపీఐ భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19వ తేదీన చిలుకూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య వర్ధంతి ఉందని, ఆ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, పాలకూరి బాబు, ధనుంజయనాయుడు, కంబాల శ్రీను, పోకల వెంకటేశ్వర్లు, బత్తిని హనుమంతరావు, మేకల శ్రీనివాస్‌రావు, మల్లేశ్వరి, లత్తు, మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని సర్పంచ్‌ల ధర్నా



మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ సర్పంచ్‌లు

మఠంపల్లి : గ్రామ పంచాయతీలకు రావాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మండలంలోని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సర్పంచ్‌లు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడం సర్పంచ్‌ల హక్కులను హరించడమేనన్నారు. సంబంధిత అధి/ కారులపై చర్యలు తీసుకుని నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ జానకిరాములుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మాలోతు సుజాతాసక్రు నాయక్, బచ్చలకూరి అఖిల, బానోతు నాగునాయక్, దారావత్ గోవింద్‌నాయక్, బానోతు విజయ బాలానాయక్, మీనా, వెంకయ్య పాల్గొన్నారు.

ప్రయోగాలతో చదువుపై విద్యార్థుల్లో ఆసక్తి



పాఠశాలలకు సైన్స్ ప్రయోగ పరికరాలు అందజేస్తున్న ఎంపీపీ గోపాల్

పాలకవీడు : ప్రయోగాలు రూపంలో అందించే బోధనతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. జెడ్పీటీసీ మాలోతు ముజ్జి మోతీలాల్ నిధులు రూ.4 లక్షలతో కొనుగోలు చేసిన సైన్స్ పరికరాలను గురువారం మండల కేంద్రంలో ఆయన ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలునాయక్, భరణి, శ్రీరాంరెడ్డి, నాయకులు జితేందర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుధా బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి




మాట్లాడుతున్న సీఈఓ పెద్దిరెడ్డి గణేష్

హుజూర్‌నగర్ : సుధా బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు చైర్మన్ మీలా మహదేవ్, సీఈఓ పెద్దిరెడ్డి గణేష్ కోరారు. ఆ బ్యాంకు ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హుజూర్‌నగర్‌లో ఖాతాదారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుధా బ్యాంకు 6 శాఖల ద్వారా సుమారు రూ. 200 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. అర్హులైన వారందరికి రుణాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు భువనగిరి భాస్కర్, వైస్ చైర్మన్ పొనుగోటి నిర్మల, కక్కిరేణి చంద్రశేఖర్, పాలిశెట్టి నరసింహారావు, బెల్లంకొండ రామచంద్ర గౌడ్, మాశెట్టి అనంతరాములు, పారుపల్లి చంద్రశేఖర్, అచ్చయ్య, మేనేజర్ పైడిమర్రి నరసింహారావు, సైదులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

గరిడేపల్లి : మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ చత్రునాయక్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎలక సైదిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎలక సైదిరెడ్డి మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బసవ కోటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కోశాధికారి సైదులు, బాల సైదిరెడ్డి, కృష్ణయ్య, శేఖర్, రేఖ, నర్సయ్య, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, రాంబాబు, వెంకట్‌రెడ్డి, సౌజన్య, రామకృష్ణ, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

జాబితాపై అభ్యంతరాలుంటే దరఖాస్తు ఇవ్వండి



గ్రామసభలో మాట్లాడుతున్న డీటీ సంధ్యారాణి

హుజూర్‌నగర్‌రూరల్ : డబుల్ బెడ్ రూం ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక జాబితాపై అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా గ్రామ పంచాయతీలో దరఖాస్తు ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. గురువారం మండలంలోని బూరుగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ షేక్ సలీమా రంజాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రూ. కోటి 88 లక్షల 70 వేలతో నిర్మించిన 30 డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 2021 సంవత్సరంలో 352 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆర్ఐలు, వీఆర్ఓలతో గ్రామంలో విచారణ చేయించి అర్హుల జాబితాను ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిపారు. ఆ జాబితాతో పాటు ఇటీవల వచ్చిన దరఖాస్తులతో కలిపి 71 మందిని నిరుపేదలుగా గుర్తించి ఎంపిక జాబితా ప్రకటించామని, ఆ జాబితాలో అనర్హులున్నట్లు అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా దరఖాస్తు ఇవ్వాలని.. ఫిర్యాదుల ఆధారంగా మరో జాబితాను తయారు చేసి, గ్రామసభ నిర్వహించి అర్హులను లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుశీల, ఆర్ఐ సూర్యనారాయణ, ఏఎస్ఓ క్రాంతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గువ్వల వీరయ్య, షేక్ అలీపాషా, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి వెలిదండ సర్పంచ్ పద్మకోటయ్య



సర్పంచ్ ఆదూరి పద్మకోటయ్యకు గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామ సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) పార్టీ సర్పంచ్ ఆదూరి పద్మకోటయ్య, వారి కుమారులు భరత్, వెంకటేష్‌తో పాటు పలువురు కార్యకర్తలు గురువారం ఎంపీపీ పెండెం సుజాత శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రామ్ సైదులు, ఎంపీటీసీ ములకలపల్లి విజయ్, రవి, బాణోతు వీటీ నాయక్, కుక్కడపు గురువయ్య, గుడెపు యాదయ్య, కాశయ్య, మురళి, వెంకన్న, ప్రసాద్, జయరాం, యాదగిరి, నర్సయ్య, మట్టపల్లి, ఉపేందర్‌రెడ్డి తదితరులున్నారు.

పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్న వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిలుకూరు మండలం కట్టకొమ్ము గూడెంకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బజ్జూరి వెంకటరెడ్డి, సైదయ్య, శివాజీనాయక్, అశోక్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వినతి

మునగాల : మండలంలోని కొక్కిరేణి, తిమ్మారెడ్డి గ్రామాల నుంచి పెన్‌పహాడ్ మండలం చెట్ల ముకుందాపురం వెళ్లే రహదారి గుంతలమయంగా మారి ప్రయాణించేందుకు వీలులేకుండా పోయిందని, తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల నాయకులు గురువారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కొండమీద గోవిందరావు, మిట్టగడుపుల ముత్యాలు, నందిగామ సైదులు, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, సర్పంచ్ బూసిపల్లి శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, సతీష్, కోటయ్య, పాపయ్య పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



నేరేడుచర్ల : మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేషం

నేరేడుచర్ల : రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ హుజూర్‌నగర్ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం, నియోజకవర్గ ప్రభారీ కర్నాటి ధనుంజయ్ అన్నారు. గురువారం నేరేడుచర్లలో జరిగిన బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి తెలంగాణ ఆత్మగౌరవాన్ని వంచించిన కేసీఆర్ కుటుంబ పాలనకు ప్రజలు చమరగీతం పాడటం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు, పుత్తూరు వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి బాలాజీనాయక్, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల బీజేపీ అధ్యక్షులు పార్తసబోయిన విజయ్‌కుమార్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

బూత్ సభ్యుల మహా సమ్మేళనంలో పాల్గొనాలి

హుజూర్‌నగర్ : బీజేపీ బూత్ కమిటీ సభ్యుల మహా సమ్మేళనంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన బూత్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వర్చువల్‌గా నిర్వహించే నియోజకవర్గాల బూత్ కమిటీ సభ్యుల మహా సమ్మేళనంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని చెప్పారు. సమావేశంలో ప్రభారీ కర్నాటి ధనుంజయ, అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు కుందూరు కోటిరెడ్డి, నాయకులు ఎం.చంద్రారెడ్డి, జి.సతీష్, ఎం.లక్ష్మీనారాయణ, జి.నారపరెడ్డి, ఎస్.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్చువల్ సమావేశంలో పాల్గొనాలి

కోదాడఅర్బన్ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 7వ తేదీన వర్చువల్‌గా నిర్వహించే బీజేపీ బూత్ సభ్యుల మహా సమ్మేళనంలో ప్రతిఒక్కరూ పాల్గొనేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేసి విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకురాలు నూనె సులోచన, నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో కోదాడ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, ఆపై బాధ్యతలు గల నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా నియామకం అయిన రౌతు కల్యాణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనగాల వెంకట్రామయ్య, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణప్రసాద్, శ్రీనివాస నాయక్, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, నాగరాజు, సతీష్, పూర్ణాచారి, వంగవీటి శ్రీనివాసరావు, మతీన్, ప్రమీల, శోభారాణి, మహేశ్వరి పాల్గొన్నారు.

ఎంపీని వ్యక్తిగతంగా విమర్శిస్తే సహించం

హుజూర్‌నగర్ : ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డిపై ఎమ్మెల్యే సైదిరెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే కాంగ్రెస్ నాయకులు సహించరని పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, అరుణ్ కుమార్, కౌన్సిలర్లు శ్రావణ్ కుమార్, సంపత్ రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి హయాంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, అరాచకాలను ఎంపీ ఉత్తమ్ వెలికితీసి ప్రజల్లోకి తీసుకెళ్తుంటే దానిని జీర్ణించుకోలేక స్థాయికి మించి ఎమ్మెల్యే మాట్లాడడం తగదన్నారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో గ్రామాల్లో చంటి పిల్లాడిని అడిగినా మీకు వివరంగా చెబుతారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్, అజీజ్ పాషా, రాజానాయక్, జక్కుల మల్లయ్య, వీరబాబు, గిరిబాబు, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, జైలు, పుల్లయ్య, యోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించేందుకే 'తొలిమెట్టు'

కోదాడఅర్బన్ : ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకే ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని, ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతంగా నిర్వహించాలని ఎంఈఓ ఎండీ సలీం షరీఫ్ అన్నారు. గురువారం స్థానిక ఎంఎస్ కళాశాలలో టీపీటీఎఫ్ యూనియన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ భిక్షం, డివిజన్ అధ్యక్షుడు బడుగుల సైదులు, నాయకులు నర్సయ్య, స్వామి, హనుమంతరావు, కైలాసపు వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

చిలుకూరు : చిలుకూరు ఎంఈఓ కార్యాలయంలో గురువారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు ఎంఈఓ సలీమ్ షరీఫ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్ గుజ్జుల నరసింహారెడ్డి, సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యలగొండ శ్రీను, మంద పుల్లయ్య, రాష్ట్ర కౌన్సిలర్ కొండా వెంకయ్య, నాయకులు గుండు ఆదినారాయణ, కొండా ధనమూర్తి, రామనర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అంకిరెడ్డి పాల్గొన్నారు.

మేళ్లచెరువులో ఎమ్మెల్యే భగత్ పూజలు



ఎమ్మెల్యే భగత్‌ను సత్కరించిన అర్చకులు, నాయకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి వారిని గురువారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి, ఎమ్మెల్యేకు స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భగత్‌ను అర్చకులు శాలువాతో సత్కరించారు. అదేవిధంగా ఆయనను బీఆర్ఎస్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు ధనుంజయశర్మ, సర్పంచ్ శంకర్‌రెడ్డి, వర్రా వెంకటరెడ్డి, కనకబండి సతీష్‌యాదవ్, జనిగ సైదులు, జక్కుల శంభయ్య, బుర్రా శంకర్, మల్లయ్య యాదవ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

మట్టపల్లి ఆలయంలో..

మఠంపల్లి : ప్రసిద్ధి గాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని గురువారం ఎమ్మెల్యే నోములభగత్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను అర్చకులు సాదరంగా ఆహ్వానించి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, యాదవ అన్నదానం సత్రం సభ్యులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలో 215 మంది ఉత్తీర్ణత



ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులతో కోచ్ నర్సింహారావు

కోదాడఅర్బన్ : కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్ఐ, పోలీస్ ఉద్యోగాల దేహదారుఢ్య పరీక్షకు శిక్షణ పొందిన 260 మంది అభ్యర్థుల్లో 215 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కోచ్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నామ నర్సింహారావు తెలిపారు. గురువారం పట్టణంలోని కేఆర్ఆర్ కళాశాల మైదానంలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను అభినందించి మాట్లాడారు. గత రెండు నెలలుగా గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించామన్నారు. ఈవెంట్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.